# అత్తగారు -బొచ్చుకుక్క

మువ్వా శ్రీనివాస్

ఆండాళ్ళమ్మగారి బొందిలో జీవుడు 'హరీ'మ్మంటూ పైకెళ్ళడం, ఓ నల్ల బొచ్చు కుక్క ఆ ఇంట్లోకి ప్రవేశించడం ఇంచుమించు ఒకేసారి జరిగింది.

చంద్రం . భోరుమన్నాడు....గుండెలు బాదుకున్నాడు. ఆ సోకాల్డ్ 'ఆండాళ్' అమ్మ గారి ఒక్కగానొక్క కొడుకు మరియు అమ్మచాటు కొడుకు చంద్రం. అవును మరి! తనో బిడ్డకు తండ్రయినా ఇంకా అతగాడు అమ్మచాటు బిడ్డే. తన చిన్నప్పుడే తండ్రి పోయాడు చంద్రానికి. దాంతో తనే తల్లితండ్రయి పెంచింది. 'అత్త చస్తే కోడలు ఏడ్చినట్లు' అనే సామెత వినుండదు కాబోలు అందుకే కస్తూరి కూడా అత్తగారు డెడ్డయితే కోడలు కంట్లో గ్లిజరిన్నోసుకున్న చందాన ఏడుపు కచ్చేరి చేస్తూనే ఉంది.

ఇక ఆ వీధిలో జనాలకైతే స్వాతంత్ర్య దినోత్సవం లాగుంది. మరి ఆండాళమ్మగారంటే పిల్లాపీచుకు అంత హడల్! ఆవిడతో తగువు పడి గెలిచిన వాళ్ళు మూడో ప్రపంచ యుద్ధం వచ్చినా తట్టుకుని ఇట్టే గట్టెక్కగలరని ఆ వీధిలోని హిస్టరీ మాస్టారి ఉవాచ.

అంత గొప్ప హిస్టరీ కలిగిన ఆండాళ్ళమ్మగారి హిస్టరీ ఈ రోజు ఇలా ముగుస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. చూఛాయగా నమ్మిన కోడలు కస్తూరికి మాత్రం తాను నమ్మిన దేవుళ్ళ మీద నమ్మకం ఇంకా దృఢమైంది. మరి ఎన్ని మొక్కులే మొక్కిందో, ఎన్ని గుళ్ళు చుట్టూ ప్రదక్షిణలే చేసిందో గుళ్ళోని దేవుళ్ళకు అర్చనలే జరిపించిందో 'అత్తగార్ని త్వరగా తీసుకెళ్ళు దేవుడా అంటూ!' కోడలి అర్చనలే ఫలించాయో అత్తగారి ఆయుష్షే తీరిందో తెలీదుకానీ ఆండాళ్ళమ్మగారైతే ఈ రోజు ఉదయం తెల్లవారకముందే బాల్చీ తన్నేసి అస్తమించారు.

"అమ్మా! నువ్వు లేకుండా నేనుండలేనమ్మా... అమ్మా! ఏ పని చేయాలన్నా నిన్నడిగే చేసేవాణ్ణి.... ఇప్పుడెవర్నడిగి చేయాలమ్మో.... అమ్మా! ఓటో తారీఖొస్తే జీతం తెచ్చి నీ చేతుల్లో పెట్టేవాణ్ణి... ఇప్పుడెవరి చేతుల్లో పెట్టాలే అమ్మో.... అమ్మా!!" - అంటూ శోకండాలు పెట్టాడు చంద్రం.

"నేనున్నాను గదరా చంద్రం ఎందుకు బాధపడ్తావ్?!" ఓదార్చాడు చంద్రాన్ని వాళ్ళ మేనమామ. "అంటే జీతం తెచ్చి మీకిస్తే తీసుకెళ్ళి పేకాట్లో పెట్టాలనే!" అడ్డుకున్నాడు చంద్రం వాళ్ళ బాబాయ్.

"మా అమ్మ లేని లోటు ఎవరూ తీర్చలేరు. నాకు మా అమ్మ కావాలి" అంటూ మరలా ఏడుపులంకించుకున్నాడు చంద్రం.

"అయ్యో! చిన్న పిల్లాడిలా అలా ఏడిస్తే ఎలా... నీకో పెళ్ళాం ఓ కొడుకూ వున్నారు. వాళ్ళు నిన్ను చూసి ఎలా బెంబేలెత్తిపోతున్నారో చూడు!" అన్నారు బంధువులు. "సంధ్యా సమయం దాటకముందే తంతు పూర్తి చేయాలి. ఇంకా రావల్సిన వాళ్ళెవరూ లేరుకదా"- అంటూ తొందర పెట్టారు ఇరుగుపొరుగు.

మొత్తానికి సూర్యుడు అస్తమించక మునుపే అస్తమించిన ఆండాళ్ళమ్మగారి భౌతిక కాయానికి అంత్యక్రియలు పూర్తయ్యాయి.

చంద్రం వచ్చి బోరింగు నీళ్ళు కూడా తాక్కుండా ఓ మూల పడుకుని కళ్ళు మూసుకున్నాడు. మూసుకున్న కళ్ళ వెనుక అమ్మ.... ఆండాళమ్మ! కలలో



అమ్మ కనిపించింది. మొదటిసారి ఆమె ముఖంలో నవ్వు చూశాడు చంద్రం. "నాన్నా చంద్రం! ఎందుకురా అలా కుమిలిపోతావ్? ఇప్పుడు నేనెక్కడికి వెళ్ళానని, నీ దగ్గరే వున్నాను కదా! వెళ్ళిపోయాననుకున్నావ్ కానీ మళ్ళీ నీ దగ్గరకు చేరుకున్నాను వెంటనే. కావలిస్తే చూడు!" అంటూ మాయమయ్యింది ఆండాళ్ళమ్మ. కల చెదిరింది. చంద్రానికి మెలకువొచ్చింది.

లేచి చూశాడు. అమ్మెక్కడ?! భార్య కోసం చూశాడు. ఆ సమయానికి కస్తూరి వంట గది తలుపులు లోపల బిగించుకుని పక్కింటి రంగనాయకి పంపిన క్యారేజీ ఆవురావురుమంటూ 'పులుసులో ఇంకొంచం కారం పట్టిద్ది' అనుకుంటూ లాగించేస్తోంది.

బయటకొచ్చాడు చంద్రం. బయట టెంట్లో బాబాయ్ మేనమామల వాగ్వివాదం - 'దినం నాడు ఇస్తట్లో పులిహోరుండాలి' అని బాబాయ్, 'కాదు బిర్యానీ వుండాలి ఆండాళ్ళక్కకు బిర్యానీయే ఇష్టం' అని మేనమామ! చంద్రాన్ని చూసి ఆపేశారు వాళ్ళు. కలలో అమ్మ కనిపించి చెప్పిన మాటలు చెప్పాడు చంద్రం వివరంగా.

"నీకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ అయింది కదా!" అడిగాడు బాబాయ్ అనుమానంగా. "గవర్నమెంటు ఓ ఇంక్రిమెంటిస్తదటగదా అంటూ అమ్మ గొడవ చేస్తే ఒక్కడికే చేయించేసుకున్నా" చెప్పాడు చంద్రం.

"చచ్చి నీ కడుపునపుడతా అనే స్కీములో పుట్టడానికి అవకాశం లేదు. ఎందుకంటే నీ సంతానోత్పత్తి కార్యక్రమానికి మంగళహారతి పాడేశావ్. మరెలా సాధ్యం?!" అంటూ ఆలోచనల్లో పడ్డాడు బాబాయ్. "నేను లేనా- అయిన వాణ్ని. అమ్మ తమ్ముణ్ని. నా రూపంలో పరకాయ ప్రవేశంచేసి ఇక్కడేవుండిపోదామనుకుంటుందేమో" అన్నాడు కొడుకుల చేత బహిష్కరించబడిన ప్రజెంట్ 'సత్రం' నియోజక వర్గ స్వతంత్ర్య అభ్యర్థి అయిన మేనమామాఫ్ చంద్రం.

ఇంతలో ఉదయం అనగా వచ్చిన ఆ బొచ్చుకుక్క తోకాడిస్తూ వచ్చి చంద్రం కాళ్ళు నాకుతూ అతని మీదకు ఎంతో ప్రేమతో ఎగబడటం తదేకంగా చూసిన పక్కింటి తంబళం శరభానంద్ అడగనే అడిగాడు "చంద్రం! ఈ బొచ్చు కుక్క ఎక్కడిది? పొద్దున్నించీ నిన్నే అంటిపెట్టుకుని తిరుగుతోందీ" అని.

అప్పుడు వెంటనే ఐడియా తట్టింది బాబాయ్కు. "కలలో మీ అమ్మ చెప్పిన మాటల్ని బట్టి చూస్తే మీ అమ్మే ఈ బొచ్చుకుక్క రూపంలో చేరిందిరా చంద్రం. మీ అమ్మకు కుక్కలంటే భలే ఇష్టం కూడా!" అంటూ బాబాయ్ అక్కడ సెటిలయిపోదామని చూస్తున్న మేనమామ ఎత్తును చిత్తు చేశాడు.

"మీరు మరీను. విడ్డూరం కాకపోతే కుక్క రూపంలో ఎలా చేరిద్ది? మా అక్కకు కుక్కలంటే చిన్నప్పట్నుంచీ మా చెడ్డ చిరాకు" అన్నాడు మేనమామ బాబాయి మాటల్ని పూర్తిగా ఖండిస్తూ. ఇంతలో "కాదండీ బాబాయ్ చెప్పింది నిజమే. మా బంధువుల్లో కూడా ఒకరి తల్లి చనిపోయి కుక్క రూపంలో తిరిగి ప్రత్యక్షమైంది. దీనిలాగానే ఆ కుక్క ఎక్కడ్నుంచొచ్చిందో ఎవరికీ తెలీదు. అదీగాక ఆండాళ్ళమ్మగారు నలుపు, ఈ బొచ్చుకుక్క కూడా నలుపే. ఆవిడగారి లాగానే ఈ కుక్క కూడా పొట్టే. ఇంకా ముఖ్యంగా ఇది పొద్దున్నుంచీ చంద్రాన్నే పట్టుకుని తిరుగుతోంది గమనించారో లేదో. కొడుకు మీద ప్రేమతో యమ ధర్మరాజును రిక్వెస్టు చేసి తన రాబోయే జన్మ 'కుక్క' అని తెల్సుకుని వెంటనే పోస్టింగ్ ఆర్డర్స్ తీసుకుని ఇలా కుక్కై తిరిగొచ్చేసింది ఆండాళ్ళమ్మ" అంటూ వత్తాసు పలికాడు తంబళం శరభానంద్. ఇంతలో ఆ కుక్క "భౌ భౌ" మంటూ అరవడం మొదలెట్టింది.

"ఆహా ఎంత బాగా అరుస్తుందో అచ్చం మా ఆండాళ్ళ వదిన అరిచినట్లే" అంటూ తనవైపు గుర్రుపెట్టి చూస్తున్న మేనమామవైపు చూస్తూ అన్నాడు బాబాయ్. అలాగే తేరిపార చూస్తుంటే ఆ బొచ్చుకుక్కలో తన తల్లిరూపం ముందు చూఛాయగా తర్వాత స్పష్టంగా కనబడసాగింది చంద్రానికి.

వెంటనే కుక్కను కావలించుకుని 'అమ్మా! అమ్మా!' అంటూ మరలా ఏడుపు కచ్చేరీ మొదలెట్టాడు చంద్రం. ఈసారి చంద్రం కార్చిన వాటిని 'కన్నీళ్ళు' అనరని వాటిని 'ఆనందభాష్పాలు' అంటారని బాబాయ్, తంబళం శరభానంద్‌ల ఉమ్మడి వ్యాఖ్య.

ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయిన తన తల్లి తిరిగి నల్లబొచ్చుకుక్క రూపంలో తనను చేరిందన్న ఆనందంతో చంద్రం మనసు ఏవేవో లోకాల్లో విహరిస్తోంది. వంటింట్లో క్యారేజీ ఖాళీచేసి హాల్లో గుర్రుపెట్టి నిద్రబోతున్న భార్య కస్తూరిని నిద్రలేపి "కస్తూ! మా అమ్మ తిరిగొచ్చేసింది - నువ్వు లేకుండా నేనుండలేను అత్తో - అంటూ ఏడ్చావ్‌గా చూడు మా అమ్మ వచ్చేసింది మన కోసం" అంటున్న భర్తవైపుకన్నా "అవునమ్మా నిజమే!" అంటూ బలపరుస్తున్న పెద్ద మనుషులవైపే వెర్రి కోపంతో చూసింది కస్తూరి.

"ఒరేయ్ కన్నా! లే లే... లేరా నాన్నమ్మొస్తే నిద్రపోతున్నావా భడవా" అంటూ తన కొడుకును కూడా నిద్ర లేపాడు చంద్రం.

అలా తెల్లారిందో లేదో కబురాలశ్యంగా అందిందంటూ ఇక కూతురింటికి రావడానికీ పోవడానికీ అక్కర్లేదనీ 'చెక్‌పోస్ట్' భయం అంతకంటే లేదనీ సంబరపడిపోతూ వచ్చిన కస్తూరి తల్లిదండ్రుల్ని చూసి బొచ్చుకుక్క పెద్ద పెట్టున అరుస్తూ వాళ్ళ మీదకు దుమకబోయింది. అంతేవాళ్ళు కుక్క శాస్త్రం తెల్సిన వాళ్ళలా వెంటనే ఇద్దరూ నేలమీద బోర్లాపడుకున్నారు. "ఇదెక్కడి కుక్క? ఆండాళ్ళమ్మగారు లేని లోటును తీరుస్తుంది" గొణిగాడు కస్తూరి తండ్రి.

ఆ గొణుగుడు విన్న బాబాయ్ "చూశావా చంద్రం! మీ మావయ్య కూడా చెప్తున్నాడు మీ అమ్మలేని లోటు ఈ బొచ్చుకుక్క తీరుస్తుందట" అన్నాడు.

"బాబాయ్! దీన్ని కుక్క అంటే నా మనస్సు చివుక్కుమంటుంది. దయచేసి మా అమ్మను ఎలా పిలిచేవాళ్ళో అలాగే పిలవండి" నొచ్చుకుంటూ అన్నాడు చంద్రం.

ఇంతలో మేనమామ జోక్యం చేసుకుని "ఇస్తట్లో బిర్యానీ సంగతి తేల్చారు కాదు" అడిగాడు. "వదినగార్నే అడిగితే పోలా" అంటూ వంగి కుక్క దగ్గర తలపెట్టి అడిగాడు బాబాయ్ "వదినో! నీకు దినం రోజు పులిహోర వండమంటావా బిర్యానీ వండమంటావా?"

వెంటనే రియాక్టయిన చంద్రం "బాబాయ్! దినం చనిపోయిన వాళ్ళ ఆత్మకు శాంతి కలగాలని చేస్తారు. చనిపోయిన మా అమ్మ తిరిగి బతికొచ్చింది కాబట్టి దినం తద్దినం లాంటివి జరపాల్సిన అవసరం లేదు" నిక్కచ్చిగా చెప్పాడు.

"అంటే బిర్యానీ లేదా?" నిట్టూర్చాడు మేనమామ. "వియ్యపు వారి బంతి కూడా లేనట్లేనా?!" నీర్సంగా అడిగాడు బాబాయ్. విమర్శల్ అండ్ నిట్టూర్పతో బంధుమిత్ర సపరివారం ఎక్కడి వాళ్ళు అక్కడ సర్దుకున్నారు చంద్రం నిర్ణయం విన్నాక. మొట్టమొదటిసారిగా భర్త మీద ఎక్కడ లేని ప్రేమ పొంగుకొచ్చింది కస్తూరికైతే అనవసరపు ఖర్చు, శ్రమ తగ్గించినందుకు.

సెలవు క్యాన్సిల్ చేసుకుని ఆఫీసుకెళ్తున్నాడు చంద్రం. రింగుల జుత్తు చంద్రం గుండు చేయించుకుంటే ఎలా వుంటాడో చూడాలనుకున్న వాళ్ళ బట్టతల బాస్ ఆశ అడియాసే అయింది.

అమ్మ.... ఆండాళ్ళమ్మ బ్రతికున్నప్పుడు ఎలాగైతే వుండేవాడో అలానే వుంటున్నాడు చంద్రం. జీతం రాగానే తీసుకెళ్ళి ఆ బొచ్చుకుక్క దగ్గరపెట్టడం "ఇదిగోమ్మా! ఈ నెల జీతం" అని చెప్పడం, అది తోకాడిస్తే తీసుకెళ్ళి బీరువాలో భద్రపర్చడం, ఓ వేళ అరిస్తేనేమో, "మరేం లేదమ్మా ఈ నెల కొలీగ్ గొడవ చేస్తే కొత్త చిట్టీలో చేరాను. అందుకే కొంత తగ్గింది. అప్పుడు చిట్టీలో చేరమంటావా అని నిన్నడిగితే తోకాడించావు కూడా" అంటూ సంజాయిషీ ఇచ్చుకోవడం, "అమ్మా! ఇంటికి రంగులు వేయిద్దామంటావా చాన్నాళ్ళయింది" అని అడిగితే కుక్క తోకాడిస్తే తర్వాత రోజే ఆ కార్యక్రమం మొదలెట్టడం, "అమ్మా! నీ కోడలికి పండక్కి శారీ కొనాల్ట" అనడిగినప్పుడు కుక్క 'భౌభౌ' మంటే "సారీ! నో శారీ" అని భార్యకు నచ్చచెప్పడం, అలా 'ఫలానా పనికి ఫలానేశ్వర్రావును కలిసి ఫలానా తేదీ రోజున చెయ్యాలా' అని చంద్రం అడగటం కుక్క తోకాడిస్తే ఒకే - 'భౌభౌ' మంటే నాటోకే!

అలా చంద్రం తన తల్లిని ఆ బొచ్చుకుక్కలో చూసుకుంటూ ఆ అమ్మకుక్కను మామూలుగా కాదు చాలా అపురూపంగా చూసుకుంటున్నాడనే చెప్పాలి.

అత్త చచ్చినా చాకిరీ తప్పలేదనట్లు వాపోయింది కస్తూరి. ప్రొద్దున్నే నిద్రలేవగానే ఇత్తడి చెంబు నిండా పాలుతాగే అలవాటుండేది ఆండాళ్ళమ్మగార్కి. ఆ ఇత్తడి చెంబు ఈజ్ ఈక్వల్‌టూ ఆఫ్ లీటర్ మిల్క్ ఆఫ్ ఎనీ పాడిగేదె. సో ఆఫ్ లీటర్ మిల్క్ ఈ బొచ్చుకుక్కకు తాపించాలి. దానికి శుభ్రంగా స్నానం చేయించాలి. వళ్ళు తుడవాలి. ఉదయం సాయంత్రం టిఫిను, రెండు పూట్లా రెండుసార్లు ప్లస్ సాయంత్రం స్పెషల్ కోటాలో అప్పుడప్పుడు మీల్స్ , ఆ మీల్స్‌లో వారానికి కనీసం మూడుసార్లు చికెన్ ఆర్ మటన్. రోజూ పడుకున్నాక దానికి వళ్ళు నొప్పులు కాళ్ళు నొప్పులు లేకపోయినా మర్ధనా చేయడం అచ్చం అత్తయ్యకు మల్లే, దువ్వెనతో జుత్తు దువ్వడం, జుత్తులో లేని పేలుకుక్కడం.... ఇలా ఒకటేమిటి అబ్బో! అత్తయ్య పీడ విరగడైందనుకుంటే ఆ స్థానాన్ని ఇదాక్రమించింది బొచ్చుకుక్క!

> "ఆ వీధిలో జనం ఒకప్పుడు ఆండాళ్ళమ్మగార్ని చూసి దడుచుకున్నట్లే ఇప్పుడు బొచ్చుకుక్కను చూసి దడుచుకుంటున్నారు. 'ఆండాళ్ళమ్మగార్ని వెలేయలేకపోయాం కానీ బొచ్చుకుక్కను వెలేయొచ్చుకదా!' అనుకుని ఆ వీధి జనమంతా చంద్రానికి తమ అభిప్రాయం చెప్పారు. 'తమ భార్యల్ని చూసి అరుస్తుందీ, తమ పిల్లల్ని చూసి కరుస్తుంది' అంటూ. దానికి చంద్రం రియాక్టయ్యి మున్సిపాలిటీ వాళ్ళు ఇచ్చిన లైసెన్స్ బిళ్ళ చూపించాడు. ఏంచేస్తారు వాళ్ళు నోళ్ళు మూసుకుని వెళ్ళిపోయారు."

స్థానం ఆక్రమించడమంటే చివరకు మంచం కూడా! పట్టెమంచం. ఆవిడపొయ్యాక ఎంచక్కా దానిమీద తను పడుకోవచ్చని తెగ సంబరపడిపోయింది కస్తూరి.

ఎలా అంటే శాస్త్రం చెబుతారు చూడండి-'అత్త చనిపోతే కోడలు ఎలా ఏడుస్తుంది?' అంటే 'పొయ్యి దగ్గర చీద్రమ్ము పోయిందిలే - పండుకొందుకు మంచి మంచం ఖాళీ అయ్యిందిలే' అంటూ ఏడుస్తుందట సంతోషంతో కోడలు.

అచ్చు అలాగే ఆశించింది కస్తూరి కూడా! కానీ భర్త ఛాదస్తంతో తన ఆశ ఏమాత్రం ఫలించలేదు.

కాకపోతే కస్తూరి భర్త లేకుండా చూసి ఆ బొచ్చుకుక్కను చెడామడా తిడ్తూనే వుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే బ్రతికున్నప్పుడు అత్తగార్ని తిట్టాలనుకున్న తిట్లను, లోలోపల తిట్టుకున్న తిట్లను ఇప్పుడు వెళ్ళగక్కేస్తోంది - 'ఒసేయ్ ఆండాళ్ళమ్మా! నేను... నేను కాబట్టి చేశానే నీ దగ్గర' అనో 'ఒసేయ్ ఆండాళ్ళమ్మ! దున్నపోతు తిండి తింటావ్ కోడలి సంగతి పట్టించుకోవే' అనో 'ఒసేయ్! నువ్వు కుక్క చావు చస్తావే' ఇలా.....ఇలాంటి తిట్లన్నమాట!

ఇకపోతే - ఎవరుపోతే?! పోయిన వాళ్ళే తిరిగి కుక్క రూపంలో పుట్టుకొస్తుంటే - చంద్రం కొడుకు కూడా నానమ్మతో బాగానే ఆడుకుంటున్నాడు.

"నాన్నమ్మా! దొంగా పోలీసాట ఆడుకుందామా" అంటూనో, "నాన్నమ్మా! ఎదురింటి వంశీగాడి బంతి తీసుకురా' అంటూ తన కొడుకు ఆ బొచ్చుకుక్కను నాన్నమ్మా నాన్నమ్మా అంటూ పిలుస్తుంటే చంద్రానికెంతో సంతోషంగా వుంది.

అలాగే ఆ వీధిలో జనం ఒకప్పుడు ఆండాళ్ళమ్మగార్ని చూసి దడుచుకున్నట్లే ఇప్పుడు బొచ్చుకుక్కను చూసి దడుచుకుంటున్నారు. 'ఆండాళ్ళమ్మగార్ని వెలేయలేకపోయాం కానీ బొచ్చుకుక్కను వెలేయొచ్చుకదా!' అనుకుని ఆ వీధి జనమంతా చంద్రానికి తమ అభిప్రాయం చెప్పారు. 'తమ భార్యల్ని చూసి అరుస్తుందీ, తమ పిల్లల్ని చూసి కరుస్తుంది' అంటూ. దానికి చంద్రం రియాక్టయ్యి మున్సిపాలిటీ వాళ్ళు ఇచ్చిన లైసెన్స్ బిళ్ళ చూపించాడు. ఏంచేస్తారు వాళ్ళు నోళ్ళుమూసుకుని వెళ్ళిపోయారు.

అలాగైనా ఆ కుక్క బెడద తప్పిద్దేమో అనుకున్న కస్తూరి మరోసారి "ఛ్ఛ!" అంది లౌడ్‌వాయిస్‌లో.

ఉన్నట్లుండి ఓ రోజు మార్కెట్లో కనిపించిన తన చిన్నప్పటి ఫ్రెండ్ నళినిని తనతో ఇంటికి వెంటబెట్టుకొచ్చింది కస్తూరి. చిన్ననాటి సంగతులు గుర్తుచేసుకుని, ఆ మాటా ఈ మాటా మాట్లాడాక కస్తూరిచ్చిన 'టీ' తాగి వెళ్ళిపోబోతున్న నళిని కాలు కసుక్కున పట్టుకుంది బొచ్చుకుక్క. అంతే ఆమె లబోదిబోమంది.

కోపం నషాళానికంటిన కస్తూరి కర్ర తీసుకుని చావబాదింది ఆ కుక్కను. అలాగైనా అది దానంతటదే ఇల్లు విడిచి వెళ్ళిపోతుందేమోనని. ఇంతకుముందు కస్తూరి ఆ కుక్కను తీసుకెళ్ళి దాని బెడద తప్పించుకోవడానికి ఎక్కడెక్కడో వదిలొచ్చేస్తే తిరిగి ఆ కుక్క ఇల్లు చేరుకునేది సాయంత్రం లోగా.

కస్తూరి కొట్టిన దెబ్బలకు ఆ కుక్కకు చర్మం చిట్లి రక్తం కారసాగింది.చంద్రం ఆఫీసు నుంచి వస్తూనే రక్తం కారుతున్న కుక్కను చూసి "అమ్మా! ఏమైంది? ఎవరితోనైనా పోట్లాటకెళ్ళావా?' అంటూ బాధపడిపోతుంటే ఇంతలో తను చూసిన సన్నివేశాన్ని పిల్లవాడు వివరించడంతో చంద్రంలో కోపం తలుపులు తెరచుకుంది. వెంటనే భార్య జుత్తు పట్టుకుని పైకి లేపి మరీ కొట్టాడు. కస్తూరి రెండు చెంపలమీదా రెండు 'హస్తం గుర్తులు' ప్రస్ఫుటంగా కనిపించసాగాయి. అలిగిన కస్తూరి వంట చేయకుండా అలాగే ముడుచుకు పడుకుంది. చంద్రం కూడా డిటో. పిల్లవాడూ డిటో అండ్ బొచ్చుకుక్కా డిటో... డిటో!

రాత్రంతా కస్తూరికి కలల్లో తన ఫ్రెండ్ నళిని మెడలోని రవ్వల నెక్లెస్సే ఈస్ట్‌మన్ కలర్లో కనిపించింది. తర్వాత రోజు ఉదయాన్నే నిద్రలేచి వంట చేసి భర్తను క్షమాపణ కోరి ఎక్కడలేని ప్రేమ కుక్క మీద చూపించడం మొదలెట్టింది - "అత్తయ్యా! ఇంకొంచెం పాలు తాగరా ప్లీజ్! అత్తయ్యా! మీకు ఈ రోజు ఎగ్‌ఫ్రై చేస్తున్నా" అంటూ! "అన్నట్లు అత్తయ్యా! మా ఫ్రెండ్ నళినీ మెడలో రవ్వల నెక్లెస్ చాలా బాగుంది కదూ! నాకూ ఒకటి

చేయించమని మీ అబ్బాయికి చెప్తానన్నారు" అంటూ ఇంకొంచెం అడ్వాన్స్ అయింది కస్తూరి.

అమ్మ ఆజ్ఞ కోసమన్నట్లు కుక్కతోక వైపు చూశాడు. అది ఉదయం నుంచీ అలాగే ఊపుతోనే వుంది తన తోకను. అంతే వెంటనే చంద్రం "కస్తూ! మన పెళ్ళిరోజుకు చిట్టీపాడి చేయిస్తాన్లే రవ్వల నెక్లెస్" అంటూ దగ్గరకు తీసుకోబోతుంటే "అయ్యో! అత్తయ్యగారు చూస్తున్నారు' అంటూ దూరం జరిగింది కస్తూరి.

రవ్వల నెక్లెస్ చేయించుకోవాలన్నది కస్తూరి చిరకాల కోరిక. పెళ్ళయిన మొదట్లో భర్తనడిగితే అమ్మ కుట్టయిన భర్త అమ్మనడిగాడు. ఆమె 'గఁయ్'మని లేచింది. అత్తగారి ఆవేశానికి తన రవ్వల నెక్లెస్ కోరిక చచ్చిపోయింది. ఆవిడ చనిపోవడంతో చనిపోయిన కోరిక తిరిగి పుట్టింది తన ఫ్రెండ్ మెడలో చూశాక!

అలా చంద్రం ఆఫీసుకు తయారయ్యి వెళ్ళబోతున్నాడో లేదో ఇలా ఇంటిముందు ఆటో ఆగింది. అందులోంచి దిగిన ఓ వ్యక్తి వస్తూనే అడిగాడు "వేరీజ్మై డింగ్‌డాంగ్?" అంటూ. చంద్రం విస్తుబోయాడు. విషయం వివరంగా చెప్పమన్నాడు.

"ఐయామ్ లాయర్ విశ్వంభర. గత కొన్ని నెలలుగా కనిపించని మా డింగ్‌డాంగ్ కుక్క కనిపించట్లేదని పేపర్లో ప్రకటన వేశాం. 'డైలీ న్యూస్ పేపర్' డైలీ చదివే అలవాటు లేదు కాబోలు. ఆచూకీ తెల్సిందని మా డింగ్‌డాంగ్ మీ ఇంట్లోనే వుందనీ మాకు మెసేజ్ అందింది. ఇస్తే తీసుకెళ్తాం" అన్నాడు విశ్వంభర. ఇంతలో కుక్క తోకాడించుకుంటూ అక్కడకు వచ్చి 'భౌభౌ' మంది. దాన్ని చూస్తూనే "హాయ్! డింగ్‌డాంగ్ ఎంత చిక్కిపోయావ్?" అంటూ లాయర్ విశ్వంభర దగ్గరకు తీసుకోబోతుంటే వెంటనే చంద్రం ఆ కుక్కను తీసుకుని "సారీ! ఇది మీ డింగ్ డాంగ్ కాదు. మా అమ్మ. కలలో కూడా కనిపించి చెప్పిందీ విషయం మాఅమ్మ. కావాలంటే మా బాబాయ్‌ని, తంబళం శరభానంద్‌నీ అడగండి" గద్గద స్వరంతో చెప్పాడు చంద్రం.

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్! అమ్మ కుక్కగా పుట్టడమేంటి? ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్లో ప్రొఫెసర్ మా ఫ్రెండే. కావాలంటే రికమెండ్ చేస్తాను. ఇది నా డింగ్‌డాంగ్. ఇచ్చేయ్ తీసుకెళ్తాను. అవతల నాకు కోర్టుకు టైమవుతోంది" అన్నాడు తొందరపెడుతూ విశ్వంభర.

"నాకూ ఆఫీసుకు టైమవుతోంది. అయినా ఇది మీ కుక్కేనని గ్యారంటీ ఏంటి?" అడిగాడు చంద్రం కోపంగా. "బొచ్చుకుక్కల్లో నల్లనివి చాలా రేర్. నా దగ్గర మాత్రమే వుందని సిటీ మొత్తం తెల్సిన విషయం" చెప్పాడు విశ్వంభర. "మా అమ్మ కూడా నలుపే. ఈ విషయం ఈ వీధిలో ఎవర్నడిగినా చెప్తారు" రెట్టించి చెప్పాడు చంద్రం.

"యూసీ మిస్టర్! నేను లాయర్నని మర్చిపోవద్దు. ప్రస్తుతం కేసుల్లేక ఫ్రీగానే వున్నాను. మర్యాదగా నా డింగ్‌డాంగ్‌నిచ్చేస్తే తీసుకెళ్తాను లేకపోతే నిన్ను కోర్టుకీడుస్తాను. చేతిలో పనే!" బెదిరించాడు విశ్వంభర.

"అవసరమైతే ఢిల్లీలో సుప్రీంకోర్టుంది పద అక్కడే తేల్చుకుందాం. ఇది మా అమ్మ.... ఆండాళ్ళమ్మ! ఇది మీ డింగ్‌డాంగ్ కాదు. కుక్క అని సంబోధించినా నే నూరుకోను" అన్నాడు చంద్రం ఆవేశంగా.

మాటా మాటా పెరిగింది. చిలికి చిలికి గాలివానయింది. వీధి జనమంతా పోగయ్యారు. అలా పోగయిన జనంలో వార్తల కోసం వెతుక్కుంటూ వస్తున్న ఓ విలేఖరి కూడా వున్నాడు.

తత్ఫలితమే తర్వాత రోజు పేపర్లో వార్త! 'ఆండాళ్ళమ్మగారనే బొచ్చుకుక్క వర్సెస్ లాయర్‌గారి డింగ్‌డాంగ్'

పేపర్లో అది చదివిన నలుగురైదుగురు వెంటనే చంద్రం ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు తప్పిపోయిన తమ కుక్కేమోననుకుంటూ. 'ఇదే మా బ్లాకీ' అని ఒక్కరంటే 'ఇదే మా పింకీ... బుజ్జిది ఎంత చిక్కిపోయిందో' అంటూ మరొకరు.

వాళ్ళ తర్వాత ఓ రాజకీయ నాయకుడు కూడా పరిగెత్తుకుంటూ వచ్చి "ఆఁ ఇదే నా ఉంపుడుకత్తె పెంపుడుకుక్క అనుమానం లేదు" అంటూ మొండికేశాడు. "కాదుగాక కాదు ఇది మా అమ్మ" అంటూ మొత్తుకున్నాడు చంద్రం.

"లేడీస్ సెంటిమెంటుతో కొట్టావా. సరే నీతోగాదు ప్రభుత్వంతోనే తేల్చుకుంటాను. కుక్కలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వమూ ఒక ప్రభుత్వమేనా? అందుకు బాధ్యతగా ఏనిమల్ హజ్‌బెండరీ రిజైన్ చేయాలని రేపు అసెంబ్లీలో గొడవ చేస్తా" అంటూ వెళ్ళిన ఆ ప్రతిపక్ష నాయకుడు నిజంగానే తర్వాత రోజు అసెంబ్లీలో తనదైన శైలిలో గందరగోళం చేశాడు.

ఇకదాంతో వరుసగా కొన్నాళ్ళపాటు పేపర్లో ఎక్కడ చూసిన చంద్రం - బొచ్చుకుక్కల ఫోటోలే. చంద్రంతో ప్రత్యేక ఇంటర్వ్యూలు కూడా!

**ఆ రవ్వల నెక్లెస్ - మొదటిసారి అత్తయ్యగారి వలన మిస్సయింది. రెండోసారి అత్తయ్యగారనే బొచ్చుకుక్క వలన మిస్సయింది.**

సంచలన వార్తగా నలగడంతో సినిమా వాళ్ళకు మంచి కథా వస్తువు దొరికినట్లనిపించింది. అందుకే ఏ సినిమా పత్రిక చూసినా - 'అమ్మ! కుక్కా' రెండో షెడ్యూల్ పూర్తి, 'కుక్కా! మజాకా' మొదటి వారంలో విడుదల, 'కొక్కతో పెట్టుకోకు' డబ్బింగ్ కార్యక్రమం, సింగపూర్ వెళ్తున్న 'మూడు కుక్కలు', 'నెంబర్ వన్ కుక్క'కు సెన్సార్ క్లీన్ సర్టిఫికేట్ - లాంటి వార్తలే.

కోర్టు నోటీసు తీసుకున్న చంద్రం మొదటి వాయిదాకు హాజరయ్యాడు. చంద్రాన్ని చూసిన లాయర్ విశ్వంభర్ 'నేనంటే ఏమనుకున్నావ్' అన్నట్లు చూశాడు. 'కోర్టులో కేసు తేలినప్పుడు సంగతి' అన్నట్లు విశ్వంభర వైపు చూశాడు చంద్రం.

చంద్రం చూపులోని భావాన్ని ఇట్టే అర్థం చేసుకున్న విశ్వంభర జడ్జిమీద ప్రెజర్ తేవడంతో ఆ కుక్కను బైండోవర్ చేయాలని ఆయన ఆర్డరు వేయడం కోర్టు ఆ కుక్కను స్వాధీనపరుచుకోవడం వెంటనే జరిగిపోయింది. చంద్రం కుమిలిపోయాడు. చనిపోయిన తల్లి కుక్క రూపంలో తనని చేరిందని సంతోషిస్తున్న అతని ఆనందానికి గండి పడింది.

ఎంత ఖర్చయినా ఫర్వాలేదని భావించి లీడింగ్ లాయర్ రామానంద్‌సాగర్ని కలిశాడు. అడ్వాన్సుగానే మొత్తం ఫీజును చిట్టీ పాడి మరీ తెచ్చిచ్చిన చంద్రాన్ని గట్టిగా కావలించుకుని ఆనందభాష్పాలు కార్చాడు లాయర్ రామానంద్ సాగర్. అవును మరి! జడ్జిమెంటు తర్వాత ఫీజిస్తామంటూ ఫీజు ఎగ్గొట్టిన క్లయింటులు ఎందరో అతని సర్వీసులో.

చంద్రానికి అభయమిచ్చిన రామానంద్‌సాగర్ రేయింబవళ్ళు డాగ్స్‌కు సంబంధించిన పుస్తకాలన్నింటినీ.రిఫర్ చేయడం, హైకోర్టు, సుప్రీంకోర్టు కేసుల తాలూకూ తీర్పుల్ని పరిశీలించడం చేయసాగాడు. ఆ పరిశీలనలో ఓ 'శీల' దొరికింది. వెంటనే విచారణ రోజునే జడ్జిముందు సుప్రీంకోర్టు తీర్పువున్న ఓ పుస్తకాన్ని తెరిచి చూపించారు. దాన్ని చదివిన ఆ జడ్జి వెంటనే ఆ తీర్పునే కాపీరైటింగ్ రాసినట్లు రాసి చదివి వినిపించాడు.

చంద్రం ఆనందంగా తన 'అమ్మ కుక్క'ను వెంటబెట్టుకుని ఇంటికొచ్చాడు.

మళ్ళీ చంద్రం, కస్తూరి ఇద్దరి కళ్ళలో కన్నీళ్ళు. ఏ కన్నీటెనకాల ఏముందో తెలుసునా? తెలుసును! చంద్రం కన్నీటిలో ఆనందం - మహదానందం! కస్తూరి కన్నీటిలో విషాదం, మిస్సయిన రవ్వల నెక్లస్సంత విషాదం.

పెళ్ళిరోజు రానే వచ్చింది. భర్తకు గుర్తుచేసింది తన రవ్వల నెక్లెస్ గూర్చి. అప్పుడు చంద్రం ఓ వేదాంతిలా నవ్వి "పిచ్చి కస్తూరీ! కోర్టు గడప తొక్కిన వాడి దగ్గర రవ్వల నెక్లెస్ చేయించేంత డబ్బు మిగిలి వుంటుందని ఎలా ఆశిస్తున్నావ్. నువ్వు జీకేలో చాలా పూర్!" అన్నాడు.

అప్పుడు కస్తూరి కూడా అలాగే వేద నవ్వు లాంటిదే నవ్వి 'రవ్వల నెక్లెస్? ఈ జన్మకు నా మెడ మీద నీకు లేదా ప్లేస్?' అనుకుంది.

ఆ రవ్వల నెక్లెస్ - మొదటిసారి అత్తయ్యగారి వలన మిస్సయింది. రెండోసారి అత్తయ్యగారనే బొచ్చుకుక్క వలన మిస్సయింది. అదే విషయం అంది తనని పరామర్శించడానికొచ్చిన నళినితో.

"కాదే కస్తూరీ! రెండోసారి చేతులారా నువ్వే మిస్ చేసుకున్నావ్. చనిపోయిన అమ్మ మీదున్న ప్రేమతో దాన్ని అమ్మగా భావించి తృప్తిపడుతున్నాడు మీ ఆయన. దాన్ని నువ్వు 'అత్త'లా కాకుండా ఓ పెంపుడు జంతువుగా చూడు. బలవంత బ్రాహ్మణార్థంలా కాకుండా దాన్ని మచ్చిక చేసుకో. దాన్ని మించిన కాలక్షేపం వుండదు నీకు. అప్పుడది చూపించే వాత్సల్యం, ప్రేమ నీ బంధువులు కూడా చూపించరు. మన దగ్గర డబ్బుంటేనే దగ్గరకు వస్తారు గౌరవిస్తారీ మనుష్యులు. కానీ పెంపుడు జంతువులు అలా కాదు. అసలు కుక్కను మించిన విశ్వాస జంతువు మరొకటి లేదని మన పిలక మాస్టారు చిన్నప్పుడు పదే పదే చెప్పేవారు మర్చిపోయావే!?

"అ రోజు నన్ను ఇది కాలు పట్టుకుం[illegible] రక్తం వచ్చేలా కొట్టినా భరించింది. నిజానికి ఆ రోజు [illegible] చేసింది తప్పే. ఏమీ అనుకోవని క్షమిస్తావనీ చెప్తున్నాను. ఎవరింట్లోనైనా కొత్త వస్తువు చూస్తే నా కళ్ళకు దురద, చేతులకు నరాల బలహీనత వస్తాయి. వెంటనే ఆ ఐటమ్‌ని కొట్టేయాలి. నువ్వు 'టీ' పెట్టడానికి వంట గదిలోకెళ్ళినప్పుడు మీ షోకేస్‌లోని సిల్వర్ కోటెడ్ షిప్ కొట్టేశాను. అలా నేను కొట్టేస్తున్నప్పుడు కళ్ళప్పగించి చూసింది మీ కుక్క. పట్టించుకోదనుకున్నాను. రక్షణకు మారుపేరు కుక్క కాబట్టే సిండికేట్ బ్యాంకు, ఇంకా ఎన్నో డిటెక్టివ్ అండ్ సెక్యూరిటీ ఏజెన్సీలు ఏంబ్లమ్‌లో స్థానం సంపాదించింది కుక్క. ఏదో ఫ్రీగా వస్తుందనే వుద్దేశ్యంతో, ఎటూ ఫ్రీగానే వున్నారు లేమ్మని మా హబ్బీకి పురమాయించానుకానీ మీ హబ్బీ ఇంత సీరియస్‌గా తీసుకుంటారనీ ఈ కుక్క కోసం ఇంత ఖర్చు పెడతారనీ నేననుకోలేదు. సారీ కస్తూరీ!.........." అంటూ చెప్పుకుపోతున్న మిసెస్ నళినీ విశ్వంభర మాటలు వింటోన్న కస్తూరి చూపు మాత్రం నళినీ మెడలోని రవ్వల నెక్లెస్ మీదే వుంది! ■